2-9-78

గెప్ర రంగారావు

శవరంజని

'సికిందర్'

లాల్ ఆఫీసులో ప్రవేశిస్తోండగా జాన్ తల ఎత్తిచూసి నిటారుగా కూచొని అడిగాడు, "లాల్ ఆకాశంలో తారలు ఎందుకు మిణుకు మిణుకుమంటాయి?"

లాల్ భుజాలెగరేసి, నోట్లోంచి సిగరెట్ తీసి నవ్వుతూ చూసి, "తారలనుంచి కాంతి భూమిని చేరడానికి రకరకాల సాంద్రతలున్న యానకాలద్వారా ప్రయాణించవలసి వుంటుంది. తత్ఫలితంగా వక్రీభవనం చెందుతుంది. ఈ వక్రీభవనమే మిణుకు మిణుకుమనడానికి కారణం" అన్నాడు.

జాన్ మరొక ప్రశ్న వేశాడు. "వేడినీటి స్నానం చేశాక బూట్లు తొడగడం ఎందుకు కష్టమవుతుంది?"

లాల్ ఉత్సాహంగా ఈలవేసి, "వేడినీటివలన రక్తం పొంగుతుంది. చర్మం దళసరి అవుతుంది. అందువల్ల కాలు ఉబ్బుతుంది. కాబట్టి బూట్లు ధరించడం కష్టమవుతుంది" అన్నాడు. "సరే, సంగతేమిటి? జాన్? ఏమిటీ

ప్రశ్నలు...?"

జాన్ అడ్డంగా తల వూపుతూ, "మరొక ప్రశ్నకు జవాబివ్వు" అన్నాడు. "శీతాకాలంలో నీటిగొట్టా లెందుకు పగులుతాయి?"

అసహనంగా చూశాడు లాల్. "జాన్, ఏమిటీ న్యూసెన్స్? విషయమేమిటి?"

"నా ప్రశ్నకి జవాబివ్వు," జాన్ రెట్టించాడు.

లాల్ మింగేసేలా చూశాడు. "నా జనరల్ నాలెడ్జిని పరీక్షించదలచుకుంటే అభ్యంతరంలేదు. సరే, నీ ప్రశ్నకి జవాబు ఇది: చలికాలంలో నీరు గడ్డకట్టి ఘనపరిమాణం హెచ్చుతుంది. అప్పుడు దాని వత్తిడి గొట్టం గోడల మీద పడుతుంది. నీరు గడ్డకట్టి అలా వ్యాకోచించడం వల్ల గొట్టాలు పగులుతాయి. వెల్, ఇక చెప్పు, నీ ప్రశ్న లోని మర్మం ఏమిటి?"

జాన్ నవ్వాడు. "మరొక ప్రశ్న?"

"చంపేస్తాను."

"ముందు నా ప్రశ్న విను" జాన్ అన్నాడు. "నా మూడు ప్రశ్నలకి చక్కగా సమాధానా లిచ్చావు.అలాగే ఈ ప్రశ్నకి జవాబివ్వు. ఏమీ ఎరుగని అమాయకమైన అమ్మాయి, తన కూతురు ఎందుకు అదృశ్యమైందని మిస్టర్ భూపతిరావ్ అడుగుతున్నాడు" జాన్ నవ్వి మళ్ళీ అన్నాడు, "జవాబివ్వగలవా?"

లాల్, జాన్ కేసి సూటిగా చూశాడు.

"ఏమిటి జాన్, నువ్వన్నది?"

"ఏమీ ఎరుగని అమాయకురాలు, తన కూతురు ఎందుకు మాయమైందని మిస్టర్ భూపతిరావ్ అడుగు తున్నాడు" అన్నాడు జాన్.

"మనకెలా తెలుసు?" లాల్ అన్నాడు అయోమయంగా.

"ఇదే ప్రశ్న ఆతడిని అడిగాను."

"ఏమన్నాడు?"

"దర్యాప్తుచేసి కనుక్కోమన్నాడు?"

లాల్ సోఫాలో చతికిలబడి, "కేసు ఒప్పుకున్నావా?" అడిగాడతను.

జాన్ తల వూపి "రెండువేలు అడ్వాన్సుకూడా తీసుకున్నాను" అన్నాడు.

లాల్ ఉషారుగా చూసి, "అమ్మాయిలు ఎందుకు అదృశ్యమవుతారో వూహించడం సులభం. సినిమా మోజులో పడి మద్రాసు చెక్కేయడంవల్లనో, ప్రేమ వలలో పడి ప్రియునితో ఎగిరిపోవడంవల్లనో, అదృశ్యమవుతుంటారు" అన్నాడు.

"ఇదే సమాధానం భూపతికి చెప్పాను" అన్నాడు జాన్. "ఈ రెండూ కారణాలు కావుట. ఆమె అమాయకురాలని మాటల సందర్భంలో వందసార్లు చెప్పాడు. చాలా అమాయకురాలు. అలాటి పనులు చేయదు. వయసు పద్దెనిమిది. చదువు: ఇంటర్ పూర్తయింది. నివాసం— పశ్చిమ గోదావరి జిల్లా కొవ్వూరు. నలుపురంగు, కోల ముఖం. కుడిచేతి మణికట్టుమీద పెద్ద పుట్టుమచ్చ—"

"ఆగు, ఏవూరన్నావు? కొవ్వూరు?"

"అవును."

"భూపతి అక్కడనుంచి వచ్చాడా?"

"అవును."

"మనం అక్కడికి వెళ్ళాలా?"

"తప్పదు."

"షటప్!" అర్చాడు లాల్. "కేసులు మనిద్దరం సంయుక్తంగా అంగీకరించాలని నీకు తెలియదూ? ఈ ఏజెన్సీ లక్ష్యమేమిటి? ట్విన్ సిటీస్‌లో మాత్రమే సేవ చేయాలని కాదూ?"

"భూపతి ముఖం చూస్తే నువ్విలా మాట్లాడవ్!" నిర్లక్ష్యంగా అన్నాడు జాన్, "ఏజెన్సీ నడవడానికి కావలసిందేమిటి?డబ్బు! దాని ఉనికిలో మనకి పనేమిటి? ఇవిగో, రాజమండ్రీకి ఫస్టుక్లాస్ రిజర్వేషన్ టికెట్స్. ప్రయాణం నేటి రాత్రి. ఉదయంకల్లా చేరతాం.అక్కడ మన క్లయింటు టాక్సీతో సిద్ధంగా వుంటాడు. మనల్ని రిసీవ్ చేసుకుని కొవ్వూరులో తన ఇంటికి తీసుకెళతాడు. ఒక్క ముక్కలో చెప్పు! వస్తావా, రావా?"

లాల్ తల విదిలించి, "కేసు స్వరూపమేమిటి?"అనడిగాడు.

జాన్ లేచి నిలబడి ఫ్యాన్ స్విచ్ నొక్కి, కిటికీ లోంచి కింద రోడ్డు చూస్తూ అన్నాడు. "కుమారి రజని భూపతిరావ్ ఏకైక సంతానం. తల్లి వుంది. ఈ సంవత్సరం ఇంటర్ సెకండ్ క్లాస్‌లో ప్యాసయింది. రాజమండ్రిలో బి.యస్.సి. సీటుకోసం ప్రయత్నాలు జరుగుతుండగా వారం రోజుల క్రితం ఆమె అకస్మాత్తుగా అదృశ్యమైంది కొవ్వూరులో. ఆమె జాడ ఎవరికీ తెలియదు. తండ్రి పోలీసు రిపోర్టు యిచ్చాడు. లాభంలేక పోయింది. వాళ్ళంతా గాలిస్తోన్నారు. ఆమె అదృశ్యమవడానికి ప్రేమ గాని, సినిమా మోజు గానీ కారణాలు కావంటున్నాడు మిస్టర్ రావ్—"

"కిడ్నాపింగ్?" లాల్ అడిగాడు.

"కాదు. ఆమెని ఎవరైనా కిడ్నాపింగ్ చేసివుంటే

ప్రతిఫలం కోరడానికి ఇన్ని రోజులు ఆగరు. భూపతి పెద్ద భూస్వామి. అరవై ఎకరాల పొలం వున్నట్టు చెప్తున్నాడు. ఒకే ఒక్క వారసురాలు రజని. అందువల్ల ఆమెని కిడ్నాప్ చేసే అవకాశం వుందని చెప్పాడుగానీ, నాకు అది సహజంగా తోచలేదు. ప్రతిఫలంకోసం యే కిడ్నాపరూ వారం రోజులు ఆగడు. వీలైనంత త్వరగా బరువు దింపుకోవాలని చూస్తాడు.''

''కిడ్నాపింగ్‌లో ఆమె ప్రమాదవశాత్తు మరణించి వుంటే?'' లాల్ అడిగాడు.

''అసలు కిడ్నాపింగ్‌కి అవకాశం లేదు!''

లాల్ నవ్వాడు.''కుటుంబ కారణాలవలన ఆత్మహత్య చేసుకునివుంటే?''

''నో! భూపతి కుటుంబంలో యెలాటి కలతలు లేవు. రజనికి యెలాటి లోటూ లేదు!''

''అయితే ఆమె అదృశ్యమవడానికి కారణమేలేదా?'' లాల్ అడిగాడు. ''ప్రతి సంఘటనకీ కారణం తప్పక వుంటుంది. రజని ఏ కారణమూ లేకుండా అదృశ్యమైందంటే, ఆమె అదృశ్యం కాలేదని అనుకోవాలి.''

''లాల్, వూహాకందని కారణాలు కొన్ని వుంటాయి. అవి కనుక్కోడానికే మనల్ని నియమించాడు మిస్టర్ రావ్. మనం పల్లెటూరి బైతులం కాము. డిటెక్టివ్‌లం కదూ? నో, గెటప్!'' అన్నాడు జాన్.

2

భూపతిరావ్ ఆతిథ్యం డిటెక్టివ్‌లకి తృప్తి కలిగించింది.

భూపతిరావ్ లోలోన ఎంత ఆందోళనపడుతున్నా పైకి మాత్రం చాలా హుందాగా ప్రవర్తించి డిటెక్టివ్

లని ఆకట్టుకున్నాడు. వూరికి దక్షిణం వేపు అతనికి రెండంతస్తుల మేడ వుంది. డిటెక్టివ్ లకి పైన ఒక గది కేటాయించాడు. రెండు నవారు మంచాలు, టేబిల్, కుర్చీలు రెండు, నిలువుటద్దం, బీరువా, సీలింగ్ ఫాను మొదలైనవి అమర్చివున్నాయి.

భూపతిరావ్ కి నలభైఏళ్ళు. ఎప్పుడూ తెల్లటి దుస్తుల్లో వుంటాడు. చామనఛాయ రంగు. అక్కడక్కడ నెరిసిన వెంట్రుకలు.

అతని భార్యకి ముప్పైఆయిదేళ్ళుంటాయి. కూతురు కన్పించకపోవడంతో ఆమె తెల్లటి ముఖం పాలిపోయి కళావిహీనంగా తయారైంది.

రజని అదృశ్యమవడానికి కారణం ఆ యింట్లో ఎవరూ చెప్పలేకపోతున్నారు. డిటెక్టివ్ లు రకరకాల ప్రశ్నలు వేశారు. సమాధానాలు బాగానే వున్నాయిగానీ, వాటిలో క్లూ ఏమీ దొరకలేదు.

"మీ కూతురు స్నేహితులెవరు?"

"విమల, చంచల, సరళ. ఈ ముగ్గురితోనే స్నేహమెక్కువ?"

"రజనిని చివరిసారిగా ఎప్పుడు చూశారు?"

"సరిగ్గా వారం రోజుల క్రితం—శనివారం ఉదయం పది గంటలకి."

"ఆమె ఏ దుస్తుల్లో వుంది?"

"నీలంరంగు లంగా, పసుపురంగు వోణీ."

"అంతకు ముందు ఆమె ప్రవర్తన ఎలా వుంది?"

"మామూలుగా వుంది. రోజూ సాయంత్రం ఆరుగంటలకి బయటికి వెళ్ళేది."

"ఎక్కడికి?"

"చెప్పేదికాదు. గంటలోపున తిరిగివచ్చేది."

"ఎన్నాళ్ళనుంచీ?"

"నాలుగు రోజులనుంచి. అయిదవరోజు అదృశ్య మైంది."

"రోజూ స్నేహితుల్ని కలుసుకునేదా?"

"అవును. వాళ్ళే ఇక్కడికి వచ్చేవారు."

"మీ దగ్గర ఆమె రహస్యాలు దాస్తుందా?"

"తెలియదు. గారాబంగా పెంచాం, మమ్మల్ని మోసం చేస్తుందనుకోము."

"శనివారం ఉదయం ఆమె ఏం చేసింది?"

"స్నానంచేసి, టిఫిన్ చేసి యేదో పుస్తకం చదువు కుంటూ పదిగంటలవరకు యిక్కడేవుంది. ఎప్పుడు బయటి కెళ్ళిందో మాకు తెలియదు. మేం చూళ్ళేదు. మధ్యాహ్నం వరకు ఎదురుచూసి స్నేహితుల యింటికి కబురు పంపాం. అక్కడికి రాలేదని చెప్పారు వాళ్ళు. ఇంటర్ పాస యింది. బి.యస్.సి. సీటు దొరకలేదు. ఆమె నిరాశ పడి యేదేనా అఘాయిత్యం చేసుకునే వీలులేదు. సాయంత్రంవరకు ఆమె జాడలేదు. వెంటనే పోలీసు రిపోర్టు ఇచ్చాం."

"ఆమె ఒంటిమీద నగలున్నాయా?"

"ఆమెకి నగలంటే ఇష్టంలేదు. మెడలో పూసల లాకెట్ వుంది."

"ఆమెకి పెళ్ళి ప్రయత్నాలు చేస్తున్నారా?"

"డిగ్రీ పూర్తయ్యేవరకు ఆ ఆలోచనే లేదు."

ఇక ఎన్ని ప్రశ్నలు వేసినా లాభంలేదనుకున్నారు డిటెక్టివ్‌లు.

ఉదయం ఎనిమిది గంటలకి ఉప్మా తిని, కాఫీ తాగి

తృప్తిగా తేన్చారు.

"లాల్, మనం ఇక్కడి ఇన్‌స్పెక్టర్‌ని కలుసుకోవాలి" అన్నాడు జాన్.

లాల్ తల వూపాడు. "రజని స్నేహితుల్ని కూడా కలుసుకోవాలి. కానీ, ముందు ఆమె గదిని పరిశీలించాలి."

భూపతి, లాల్‌నీ, జాన్‌నీ రజని గదిలోకి తీసుకెళ్ళాడు. గది చక్కగా అలంకరించి వుంది. మంచం, బీరువా, టేబిల్, కుర్చీ, నిలువుటద్దం, పడకకుర్చీ మొదలైనవి వున్నాయి.

లాల్, జాన్‌లు సోదాచేస్తూ బీరువా తలుపు తెరిచారు. వరసగా పేర్చివున్న పుస్తకాలు దర్శనమిచ్చాయి. వాటిలో చాలావరకు తెలుగు పాకెట్ బుక్స్ వున్నాయి. ఒక్కొక్కటి తీసి పరిశీలించసాగారు. ప్రముఖ తెలుగు రచయితల సాంఘిక నవలలతోబాటు కొన్ని డిటెక్టివ్ పుస్తకాలున్నాయి: కొమ్మూరి, గిరిజ, టెంపోరావ్... కుమారి చంచల...

డిటెక్టివ్‌లు తల విదిలించి భూపతిని చూశారు.

"ఈ కుమారి చంచల రజని స్నేహితురాలు. చాలా డిటెక్టివ్ నవలలు వ్రాసింది...వ్రాస్తోంది కూడా." అన్నాడు భూపతి.

లాల్ భుజాలెగరేశాడు.

భూపతి మళ్ళీ అన్నాడు. "మీరు డిటెక్టివ్‌లు. డిటెక్టివ్ సాహిత్యంలో ఆరితేరిన రచయిత్రి చంచల పేరు మీరు విన్లేదా?"

"విన్నాను." అన్నాడు జాన్. "వినడమే కాదు, చదివాను కూడా ఆమె నవల. కుమారి చంచల వ్రాసింది

'చావు చెప్పిరాదు!' చదివినట్లు జ్ఞాపకం. కానీ, అంతగా పట్టించుకోలేదు. ఆమె ఆరితేరిన రచయిత్రి అని తెలీదు.''

''ఇప్పుడు తెలిసిందిగా?''

''తెలిసింది. అలాటి రచయిత్రిని మేం కలుసుకోవాలి.''

జాన్, భూపతిలు మాట్లాడుకుంటోండగా లాల్ గది సోదా చేయడంలో నిమగ్నుడయాడు. టేబిల్ సొరుగులో ఒక ఉత్తరాల కట్ట కన్పించింది. చకచక పరిశీలించాడు. అన్నీ వివిధ ప్రదేశాల నుంచి కలం స్నేహితులు వ్రాసిన ఉత్తరాలే. అది లాల్ దృష్టిని అంతగా ఆకర్షించలేదు. కానీ, వుత్తరాల మధ్య సరికొత్త వందరూపాయల నోటు అతడిని వులిక్కిపడేలా చేసింది.

సరిగ్గా అదేక్షణంలో భూపతి కళ్ళు ఆ నోటుమీద పడి నోరు తెరిచాడు, ''ఇది...ఇదెక్కడిది?''

లాల్ అతన్ని చూశాడు, ''మీరివ్వలేదా?''

జాన్ ముందుకు వచ్చి ఆ నోటు అందుకున్నాడు.

''వందరూపాయల కాయితం ఆమెకెన్నడూ ఇవ్వలేదు!'' భూపతి గొంతు బొంగురుపోయింది.

''రావుగారూ, పోలీసులతో మాట్లాడే విధంగా మాతో మాట్లాడితే మేం యీ కేసు వదులుకుంటాం. మా వల్ల మీ పరువుకు భంగం కలగదు. ఇప్పటివరకు మీరేవైనా ముఖ్యవిషయాలు దాచివుంటే, ఇకనైనా బయటపెడితే మీకే లాభం'' అన్నాడు లాల్.

''ఏమిటి మీరనేది! నేనేం దాచాను?''

''మీ కూతురు ఎవరినైనా ప్రేమిస్తోందో, లేదో నిజం చెప్పండి.''

''లేదు!''

"మేం మీ పరువు తియ్యం. మరొకసారి అడుగుతున్నాను—"

"ఎన్నిసార్లడిగినా నేను చెప్పేదొకటే: నాకు తెలిసినంతవరకు ఆమె ఎవరినీ ప్రేమించడం లేదు!"

"ఈ వూళ్ళో ఇంకెవరైనా కుర్రాళ్ళు అదృశ్యమైయారా?"

"మీ ఉద్దేశ్యం? నా కూతురు ఏ కుర్రాడితోనో పారిపోయిందా?"

"ఎందుకు పారిపోకూడదు?" అన్నాడు లాల్.

జాన్ కల్పించుకుని అన్నాడు, "తన కూతురు అమాయకురాలని ఆయన ఆఫీసులో వందసార్లు చెప్పారు, లాల్."

"గారాబంగా పెంచడంవల్ల అలా చెప్పారనుకుంటాను" అన్నాడు లాల్, "సరే, రావుగారూ, మీ భార్యతో మేం ఏకాంతంగా మాట్లాడాలి. మీరు వెళ్ళి ఆమెను పంపిస్తారా?"

"నా భార్యతో ఏం మాట్లాడతారు?"

"తండ్రికి చెప్పలేని విషయాలెన్నో తల్లికి చెప్తారు అమ్మాయిలు" అన్నాడు లాల్. భూపతి అదోలా చూసి వెనుదిరిగాడు. అతను అదృశ్యమయ్యాక లాల్ వేపు తిరిగాడు జాన్.

"ఏమిటి లాల్, ఈ వందరూపాయల మిస్టరీ?"

"తండ్రి ఆమెకివ్వలేదు. తల్లి ఇచ్చిందేమో కనుక్కోవాలి. ఇందులో మిస్టరీ ఏమీ లేదు. ఇది సాధారణ విషయం. జాన్, వుత్తరాలు శ్రద్ధగా చదువు. క్లూస్ దొరుకుతాయేమో చూద్దాం. కుమారి రజనికి ఏయే విషయాలపైన ఆసక్తి వుందో తెలియవచ్చు—"

గదిలో భూపతిభార్య ప్రత్యక్షమైంది.

లాల్ మాటలాపేసి జాన్‌కి సైగచేశాడు. ఉత్తరాల కట్టపట్టుకుని బయటికెళ్ళాడు జాన్.

"రజనికి మీరెప్పుడేనా డబ్బిస్తారా?" అడిగాడు లాల్ భూపతి భార్యని.

ఆమె చటుక్కున బయటికి వెళ్ళి నడవాలో అటూ ఇటూ చూసి తిరిగి వచ్చింది. లాల్ నవ్వి, "మీ భర్త ఇటురాడు. భయపడకండి. జాన్ అతనితో వుంటాడు" అన్నాడు.

ఆమె లాల్‌ని తీక్షణంగా చూస్తూ, "లేదు ఎప్పుడూ ఇవ్వను!" అంది.

"ఎందుకు?" లాల్ అడిగాడు.

"ఆయన నాకిస్తే కదా, నేనామెకి ఇచ్చేది?"

"ఎందుకు ఆర్థిక స్వాతంత్ర్యంలేదా?"

ఆమె అడ్డంగా తల వూపింది. "నా కంటే ఆయనకి డబ్బు ఎక్కువ."

"ఓహ్, క్షమించండి. రజని మీ కేయే విషయాలు చెప్పేది?"

ఆమె కోపంగా అంది. "ఉదయమేగా ప్రశ్నలడిగింది! రాజీమీద ఔంకతో నేనుంటే ఓదార్చేవారు లేరు! పైగా ప్రశ్నలడుగుతూ ప్రాణాలు తీస్తున్నారు! నాకు తెలుసు. రాజీ జాడ తెలుసుకోడం ఎవరికీ చాతకాదని. పోలీసులు చేతులు కట్టుకుని కాలక్షేపం చేస్తున్నారు. ఆ ఇన్‌స్పెక్టర్ దగ్గర కండబలం వుందిగానీ, బుద్ధిబలం లేదు!"

"మా దగ్గర బుద్ధిబలం వుందిగాని, కండబలం లేదు" అన్నాడు లాల్. "చూడండి, రజని జాడ మేం తెలుసు

కోడం మీకిష్టం వుందా, లేదా?''

''రాజీ! రాజీజాడ మీరు తెలుసుకుంటారా? ఆ బుర్ర మీసాల ఇన్ స్పెక్టర్ గాలిస్తూ నేవున్నాడు వారం నుంచీ. ఈ వారం రోజుల్లో ఆ విషయం పాతబడిపోయింది. మీరు ఆలస్యంగా వచ్చారు, ఏమీ చేయలేరు! ఏదో జరక్కూడనిది ఎప్పుడో జరిగిపోయింది!''

''మిమ్మల్ని ఓదార్చే వ్యవధి నాకులేదు. రజనికి వందరూపాయల నోటు ఎక్కడనుంచి వచ్చింది?''

''నాకేం తెలుసు! తండ్రి ఇచ్చాడేమో!''

''ఇవ్వలేదు.''

''మరి? ఆమెకెక్కడ నుంచి వచ్చాయి వంద రూపాయలు? మీ అనుమానం ఏమిటి? ఇన్ స్పెక్టర్ వచ్చి ఈ గది గాలిస్తే ఈ నోటు ఎందుకు దొరకలేదు?''

''మీ ఉద్దేశ్యం, ఈ గది గాలించాక నోటు ఇక్కడికి వచ్చిందా? ఎలా వచ్చింది? ఎవరైనా పెట్టారా? నిజం చెప్పండి, మీరే దాచారా?''

''ఏయ్, ఏమిటిది?''

లాల్ నవ్వాడు. ''దూషణ మానుకోవాలి, సరే? మీ ఉద్దేశ్యం ఏమిటో నాకు చెప్పలేదు. ఇక నా ఉద్దేశ్యం చెప్తాను. ఆర్థిక స్వాతంత్ర్యం లేని స్త్రీ మీరు. మీ చేతికి డబ్బు అందితే దానికి ఎంత విలువ వస్తుందో మీకు తెలుసు. ముఖ్యంగా ఆ డబ్బు భర్త కంట బడకుండా జాగ్రత్త తీసుకుంటారు! చెప్పండి నా ఉద్దేశ్యం మీ కర్థమైందను కుంటాను, అలాటి ప్రయత్నంలో ఈ నోటు మీరిక్కడ దాచారా?''

ఆమె పూర్తిగా ఆశ్చర్యపోయింది. ''ఏమిటీ పాడు ఆలోచనలు!''

లాల్ మళ్ళీ నవ్వాడు, "మీరు దాచకపోతే ఇన్‌స్పెక్టర్ సరిగా సోదా చేయలేదనుకోవాలి. నిజమేమిటో అతన్ని కలుసుకున్నాక తెలుస్తుంది. ఇక ఈ నోటు గురించి మరిచిపోదాం. నా ప్రశ్నకి సమాధానమివ్వండి: రజని మీకేయే విషయాలు చెప్పేది?"

ఆమె కుదుట పడింది, "దానికి తెలివి ఎక్కువ. చదువులో కాదు, ఇతర విషయాల్లో. నలుగురొక చోట చేరి ఏదో విషయం చర్చించుకుంటే చాలు, ఇది మధ్యలో వెళ్ళి ఆ చర్చ ఏమిటో గ్రహించి, గడగడ వాగేస్తుంది. వినేవాళ్ళు వింటుపోతారు. లోకజ్ఞానం ఎక్కువ. ఇక, సంవత్సరం నుంచీ ఏవో పాడు పుస్తకాలు చదవడం చూస్తున్నాను. ఏమిటవి అడిగితే ఏవో డిటెక్టివ్ పుస్తకాలని చెప్పేది. అవి నీ కెందుకూ అంటే ఆత్మ రక్షణకు పనికొస్తాయనేది. చెప్పడం మరిచాను, వూరి బయట పొలాల మధ్య, పాడుబడ్డ యింట్లో దీని నేస్తం దెయ్యంలా కథలు వ్రాయడం మొదలుపెట్టింది. దానికీ దీనికీ మంచి స్నేహం. ఆ అమ్మాయి పేరు చంచల. రాజీకంటే మూడేళ్ళు పెద్దది. రాజీని చెడగొట్టింది ఆమే!"

"ఎలా?"

"ఆమె కథలు వ్రాయడమూను, ఈమె చదవడమూను. చెడిపోక ఏమవుతుంది? అందుకేగా ఇంటర్‌లో క్లాసురానిది! ఈమెగారు పాడుపుస్తకాలు చదవడం ఆమెగారి పుణ్యమే."

"ఆమె అంటే మీకు కోపమా?"

"కోపమే కాదు, అది ఆడదేనా అన్న అనుమానం కూడా. ఆడవాళ్ళు యిలాంటి పాడుకథలు వ్రాయడం నేనెక్కడా చూడలేదు. ఉదాహరణకి యద్దనపూడి,

మాదిరెడ్డి కథలు చదవండి: అందులో హత్యలుంటాయా? దోపిడీలుంటాయా? మానభంగాలుంటాయా?"

లాల్ నిట్టూర్చాడు. "చంచల గురించి వివరాలు చెప్తారా?"

ఆమె కొంగుతో మొహం తుడుచుకుని అంది, "రాజీ కన్పించని విషయం మా బంధువులెవరికీ చెప్పలేను. వూళ్ళో రకరకాల పుకార్లు వున్నాయనుకోండి. అది ఎలాంటి స్థితిలో తిరిగివస్తుందో ఆలోచించలేకపోతున్నాను. చంచలకి రాజీతో మంచిస్నేహం. సూర్యారావుగారి కూతురు చంచల. ఆమెకో తమ్ముడు కూడా వున్నాడు. బి. యస్‌సి. వరకు చదువుకుంది. హిందీ విశారద పరీక్ష పాసయింది. ఉద్యోగం చేయాలనుకోడంలేదు, అలాగని పెళ్ళివిషయం ఎత్తడంలేదు. వ్రాతల్లో పడింది. తండ్రికి ఆమెగురించి ఎలాంటి పట్టింపూ లేదు."

"వూరిబయట, పొలాలమధ్య, పాడుబడ్డ ఇంట్లో... ఇది కాస్త వివరిస్తారా?"

నవ్విందామె. "వాళ్ళకి ముప్ఫై ఎకరాల పొలాలున్నాయి. పొలంమధ్య ఎప్పటినుంచో చిన్న రెండంతస్తుల ఇల్లువుండేది. ఇప్పుడది శిధిలమైంది. రాత్రులు అందులో దెయ్యాలుంటాయో వుండవోగానీ, చంచల మాత్రం అందులో పగటిదెయ్యంలా గడుపుతుంది. ఆమె గురించి నేను చెప్పడం కంటే మీరు ఆమెని కలుసుకుని అడగడం మంచిది—"

"మంచిది. రజని కట్టుబట్టలతో మాయమైందంటారా?"

"అవును."

"సరే, సరళ, విమల గురించి ఏమిటి?"

"మంచి అమ్మాయిలు. వాళ్ళకి చంచల అంటే గిట్టదు."

"రజనికి చంచలతో స్నేహముంది. ఇది సరళ, విమలకి ఇష్టమేనా?"

"నాకు తెలియదు."

"మంచిది. ఇప్పుడు ఒకే ఒక ప్రశ్నకి సమాధానం చెప్పండి: తండ్రి దగ్గరగాని, మీ దగ్గరగానీ రజని ఏ వేనా విషయాలు దాసుందా?"

"లేదు, లేదు!" అందామె వెంటనే. "దాని దగ్గర ఏ రహస్యమూ దాగదు."

"తండ్రికి చెప్పని విషయాలు మీకు చెప్తుందా?"

"చెప్పేదేదో మా ఇద్దరిముందే చెప్తుంది."

"ధన్యవాదాలు, మీరిక వెళ్ళవచ్చు" అన్నాడు లాల్.

3

జాన్ గబగబ వచ్చి లాల్‌ని చేరుకుని, "ఏమిటి, ఏం జరిగింది?" అనడిగాడు.

లాల్ తలవూపి, "ఇన్‌స్పెక్టర్ రజని గది సోదా చేసినప్పుడు ఈ వందరూపాయల నోటు కన్పించలేదు. ఆ తర్వాత అక్కడ దాన్ని ఎవరో పెట్టారు. అలా పెట్టడంలో ఏమిటి వుద్దేశ్యం."

"కేసును తప్పుదోవ పట్టించడం."

"వెల్, మనం ఇన్‌స్పెక్టర్‌ని కలుసుకున్నాకే నిర్ణయానికి రావాలి" అన్నాడు లాల్. "ఆ వుత్తరాల్లో ఏముంది?"

"లాల్, ఇలాటి వుత్తరాలు నేనెప్పుడూ చదవ

లేదు!" జాన్ అన్నాడు అలసటగా, "ఇవన్నీ పెన్ ఫ్రెండ్స్ వ్రాసిన వుత్తరాలే. అందరూ అమ్మాయిలే! మీ అభిమాన నటి ఎవరు? రచయిత్రి ఎవరు? ఎలాటి నగలంటే ఇష్టం? స్త్రీ స్వాతంత్రం మీద మీ అభిప్రాయ మేమిటి?...సో అండ్ సో, ఎ లాట్ ఆఫ్ నాన్సెన్స్ కానీ, ఒక్క వుత్తరం మాత్రం చంచల వ్రాసింది."

లాల్ కళ్ళు చిట్లించాడు. "ఏం వ్రాసింది?"

"మూడు నెలల క్రితం గుంటూరు నుంచి వ్రాసింది. సాంఘిక నవలలు వ్రాయడం తనకి చేతకాదనీ, డిటెక్టివ్ సాహిత్యంలో శిఖరాన్ని చేరుకున్న తన పేరు ప్రతిష్టలు పాతాళానికి జారుకోడం తనకిష్టం లేదనీ, తను వ్రాసే నవలలు వేలసంఖ్యలో అమ్ముడవడం తనకెంతో గర్వంగా వుందనీ, అంతకంటే అభిమానుల నుంచి వచ్చే వందల కొలది వుత్తరాలు తనని వుక్కిరిబిక్కిరి చేస్తున్నాయనీ, రజని ఇలాటి సమయంలో డిటెక్టివ్ కథలు మానుకుని సాంఘిక కథలు వ్రాయమనడం ఏమీ సబబుగా లేదనీ ఇలా ఎన్నెన్నో విషయాలు వ్రాసి చివరికి ఒక హెచ్చరికతో ముగించింది."

"ఏమిటది?"

"డిటెక్టివ్ కథలు మానుకోమని రజని ఇలా మాటి మాటికీ వేధించడం తనకెంతో విసుగు పుట్టిస్తోందనీ, ఆమె అలా వేధించడం కేవలం ఈర్ష్య తప్ప మరేమీ కాదనీ, తన రచనలు విషయం మరొక్కసారి ఎత్తితే తమ స్నేహానికి ముప్పు తప్పదనీ హెచ్చరించింది."

లాల్ సాలోచనగా తలూపాడు. ఆ తర్వాత ఇద్దరూ పోలీస్ స్టేషన్ కి వెళ్ళారు.

ఇన్ స్పెక్టర్ డిటెక్టివ్ లని చూడగానే సర్దుకుని

కూచున్నాడు.

లాల్ జేబులోంచి విజిటింగ్ కార్డుతీసి టేబిల్ పైన పడేశాడు.

ఇన్‌స్పెక్టర్ కళ్ళద్దాలు పెట్టుకుని కార్డు చదివి, నెమ్మదిగా తల ఎత్తి ఇద్దర్నీ చూసి, "కూచోండి" అన్నాడు. లాల్, జాన్ కూచున్నారు.

"నా పేరు పోతరాజు" అన్నాడు ఇన్‌స్పెక్టర్ చెయ్యి ముందుకు చాచి. డిటెక్టివ్‌లిద్దరూ కరచాలనం చేసి నవ్వారు.

"మీరిక్కడికి రావడానికి కారణమేమిటి?" మళ్ళీ అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"ఒక మిస్టరీ ఛేదించడానికి వచ్చాం" అన్నాడు లాల్. "మిస్సింగ్ పర్సన్ కేస్" పోతరాజు భుజాలెగరేశాడు "రజని గురించా?"

"అవును. మేం చేసిన దర్యాప్తును బట్టి కేసు కొంత వరకు అర్థమైంది. అయితే మీతో ఒక విషయం మాట్లాడాలి."

"ఏమిటి?"

"రజని గది మీరు సోదా చేశారా?"

"అంగుళం వదలకుండా."

"రిజల్ట్ ఏమిటి?"

పోతరాజు అనుమానంగా చూశాడు లాల్‌ని, "మిమ్మల్ని భూపతి పిల్చాడా? ఆ విషయం నాతో చెప్పలేదే?"

"అతను నిన్న హైదరాబాదుకొచ్చాడు."

పోతరాజు ముఖం మాడ్చుకుని, "నాతో యెందుకు చెప్పలేదో నాకు తెలుసు" అన్నాడు. "నా పరిశోధన

మీద నమ్మకంలేక మిమ్మల్ని పిల్చుక వచ్చాను. నాలోని లోపాల్ని ముఖంమీద చెప్పేవాళ్ళంటే నా కిష్టం. భూపతి ఆ సాహసం చేయలేకపోయాడు. ఛీ, పాడు జనం. పోలీసుల్లో అసలు విశ్వాసం లేదు!''

``ఎమర్జన్సీ ప్రభావమనుకుంటాను...'' అన్నాడు లాల్.

``సరే, మీకు దొరికిన క్లూస్ ఏమిటి?'' అడిగాడు జాన్.

``నాకు దొరికిన క్లూస్‌లో ముఖ్యమైనది ఒక ఉత్తరం'' అన్నాడు పోతరాజు. ``ఆ ఉత్తరం రజని ఎందుకో ఆరంభంలోనే ఆపేసింది. తేదీ నెలరోజుల క్రిందటిది. ఆ ఉత్తరం ఆమె నాకు వ్రాయదల్చుకుంది—''

``మీకా?''

``నాకే. ఏ ఉద్దేశంతో వ్రాయదల్చుకుందో తెలియదు. విషయమేమిటో తెలియదు. అందులో మూడే మూడు వాక్యాలున్నాయి.''

``చూపించండి.''

పోతరాజు హెచ్.సి.కి సైగ చేశాడు. హెచ్.సి. పక్క గదిలోకెళ్ళి సేఫ్‌లోంచి ఒక ఉత్తరంతో తిరిగి వచ్చాడు—నీలంరంగు ఇన్‌లాండ్ లెటర్.

లాల్ ఆ లెటర్ అందుకుని పరిశీలించాడు. పైన అడ్రసు లేదు. మడత విప్పాడు. అందులో యిలావుంది:—

కొవ్వూరు
26-5-1978

గౌరవనీయులైన సబ్-ఇన్స్పెక్టర్ పోతరాజు గారికి,

రజని నమస్కరించి వ్రాయునది...

ముఖ్యంగా మీకు తెలియజేయునదేమనగా—

ఆ తర్వాత లాల్‌కి అక్షరాలు కన్పించలేదు.

"మిస్టరీ," అన్నాడు ఉత్తరం జాన్‌కి అందిస్తూ. "ఇన్‌స్పెక్టర్, మీ అభిప్రాయ మేమిటి?"

ఇన్‌స్పెక్టర్ ముక్కుపుటాలెగరేశాడు. రజని అనుకోకుండా అదృశ్యం కాలేదని, దాని వెనక చాలా కథ వుందని నా అభిప్రాయం. ఈ ఉత్తరం ఆమె నాకు వ్రాసిందంటే దేనికో భయపడుతుండాలి."

"అంటే, ఆమె నెవరైనా బెదిరిస్తున్నారా?"

"నాకు తెలియదు. ఈ వూళ్ళో అలాటి వాళ్ళెవరూ లేరు. ఇక్కడున్న కుర్రాళ్ళు చాలా బుద్ధిమంతులు."

"మరి ఆమె దేనికి భయపడుతోంది?"

"ఒక్కటి మాత్రం చెప్పగలను. సరిగ్గా నెల రోజుల క్రితం ఆమె ఈ వుత్తరం వ్రాసింది. ఒక అమ్మాయి పోలీసులకి ఏ పరిస్థితిలో ఉత్తరం వ్రాస్తుందో మీకు తెలుసు. ఆమె వుత్తరం వ్రాయడానికి కారణం ఏదో అపాయంలో చిక్కుకోవడం. కానీ, పూర్తిగా వ్రాయకుండా వదిలేయడానికి కారణం ఆమె ఎదురు చూసిన అపాయం తొలిగిపోవడం. అంతే, అయితే వారం రోజుల క్రితం అదే అపాయం అనుకోకుండా ఎదురైంది. మా దగ్గరికి వచ్చే వ్యవధికూడ ఆమెకి లేదు. అందుకే ఎక్కడో క్షేమంగా వుండే చోటుకి వెళ్ళిపోయింది. అదెక్కడో నాకు తెలియదు."

"ఒకవేళ మనం ఇలా వూహిస్తే?"

"ఎలా?"

"ఆమెకి క్షేమకరమైన చోటు పరలోకమైతే?"

"వాట్!"

"ఆశ్చర్యపడకండి. అది నా వూహ. వూహ ఎప్పుడూ

నిజంగానవసరంలేదు" లాల్ అన్నాడు మృదువుగా. "ఈ వూళ్ళో ఆరితేరిన డిటెక్టివ్ రచయిత్రి వుందిట?"

"చంచల" అన్నాడు ఇన్ స్పెక్టర్. "గుడ్ గర్ల్— మంచి అమ్మాయి. తెలివి వుంది, అందం వుంది, కానీ ఒక్కటే లేదు—"

"ఏమిటి?"

"పెళ్ళి చేసుకోవాలనే ఆలోచన. సరే, మీరామె కథలు చదివారా? ఓహ్, ఎక్కడి అయిడియాలు! ఎక్కడి సస్పెన్సూ! సుపర్బ్! ఆమెముందు రచయితలంతా బలాదూర్."

"ఆమె రచయిత్రి యెలా అయింది?"

"అది నాకు తెలియదు. నాకేదైనా సమస్య ఎదురయినప్పుడల్లా ఆమె దగ్గరికి పరిగెడతాను. చక్కగా పరిష్కారం చూపిస్తుంది. ఆమెకి రోజుకి వంద ఉత్తరాలు వస్తాయి. అందరూ తమ సమస్యలకి పరిష్కారం కోరేవారే. వాటికి ఆమె సెక్రటరీ సంపత్ సమాధానాలిస్తాడు—"

"మరి రజని కేసుకి ఆమె పరిష్కారం చూపలేదా?" లాల్ అడిగాడు.

పోతరాజు పెదవులు చప్పరించి అన్నాడు. "ఆ ఉత్తరం గురించి ఇందాక నేను చెప్పిన అభిప్రాయం నిజానికి చంచలదే! ఆమె ఇంకా ఏం చెప్పిందో చెప్తాను వినండి: డిటెక్టివ్ పుస్తకాలు చదివే అమ్మాయిలకి ఆత్మరక్షణగురించి తాపత్రయంవుంటుంది. లోకంలో అమ్మాయిలకి క్షేమకరమైన రోజులు కొరవడ్డాయి గనుక, తమ శక్తిసామర్థ్యాలతో తమని రక్షించుకోడానికి ప్రయత్నిస్తారు. ఇతరులమీద ఆధారపడేందుకు జంకుతారు. రజని

జాడ తెలిపే ఆధారాలేవీ లేవు గనుక ఆమె అదృశ్య మవడం ఆత్మరక్షణకోసం తీసుకున్న చర్యగా భావించ వచ్చు. ఆమె గండం గడిచాక తప్పకుండా ప్రత్యక్షమవు తుంది."

"ఆ గండం ఏమిటో ఆమె చెప్పిందా?"

"చెప్పింది. బ్లాక్ మెయిలింగ్ కావచ్చు."

"ఎలా?"

"ఆమె ఎవరినైనా ప్రేమిస్తుండ వచ్చు. తర్వాత తిరస్కరించి వుండవచ్చు. కాబట్టి ప్రియుడు బ్లాక్ మెయిలింగ్ చేస్తుండవచ్చు. కానీ ఆమె ఎవర్నీ ప్రేమి స్తున్నట్టు దాఖలాలు లేవు."

"కిడ్నాపింగ్?"

"అవకాశం వుంది. కానీ, డబ్బుకోసంకాదు. ప్రేమ కోసం, ఆమె తిరస్కారం పొందిన వ్యక్తి ఆమె ప్రేమ కోసం కిడ్నాప్ చేసి, బెదిరించి సాధించుకోవచ్చు."

"ఆల్ రైట్, ఇన్ స్పెక్టర్," లాల్ అన్నాడు నిట్టూర్చి. "మేము చంచలను కలుసుకుంటే ఇంకా చాలా విషయాలు తెలియవచ్చు. మీ కింకా యేం క్లూస్ దొరి కాయి?"

"అవి మీకు ఉపయోగపడవు."

అనుమానంగా చూశాడు లాల్.

"నమ్మండి." ఇన్ స్పెక్టర్ అన్నాడు.

"ఆల్ రైట్, మేజా సొరుగు లాగి అందులోని ఉత్త రాలు పరిశీలించారా?"

"ఆ వుత్తరాల్లో ఏముంది?"

"ఉత్తరాల మధ్య వందరూపాయల కాయితం వుంది."

"వాట్!"

"మీకు కన్పించలేదా?"

ఇన్‌స్పెక్టర్ అయోమయంగా చూశాడు. "నో! కన్పించలేదు! ప్రతి అంగుళం సోదా చేశాను!"

"మీరు సోదా చేశాక అక్కడెవరో బుద్ధిపూర్వకంగా దాచారనుకుంటాను." అన్నాడు లాల్.

"ఎవరు?" ఇన్‌స్పెక్టర్ అర్చాడు ఉద్రేకంగా.

"కనుక్కుంటాను" లాల్ అన్నాడు. "ఆల్‌రైట్, ఈ కేసు త్వరగా తేలిపోతుందని నా అంచనా. ఆలోచనలతో మీ మెదడు వేడెక్కిందనుకుంటాను. విశ్రాంతి తీసుకోండి, కేసు మాకు వదలండి."

4

లాల్ సిగరెట్ వెలిగించి జాన్‌ని చూసి నవ్వాడు. "ప్లాంటెడ్ ఎవిడెన్స్." అన్నాడతను. "ఈ వంద రూపాయలనోటు దొరికినప్పటినుంచీ కేసు హండ్రెడ్ పర్సెంట్ మిస్టరీగా తయారయింది. నీకేదయినా మార్గం తట్టిందా జాన్?"

జాన్ నీరసంగా తల వూపాడు. "ముందు ఆకలి తీర్చుకున్నాక మార్గం ఆలోచిస్తాను. ఈపూట కోడికూర అని చెప్పాడు భూపతి. అప్పటినుంచి మనసు మనసులో లేదు, నన్నేమీ అడక్కు."

లాల్, జాన్ ముఖాన్ని చూసి ఒక నిర్ణయానికి వచ్చాడు. "సరే, నువ్వింటికెళ్ళి కోడికూర తిని పడుకో. కానీ పడుకునేముందు ఒక పని చెయ్—"

"ఆఁ! చేస్తాను."

"ఏమిటి?"

"విస్కీ తాగమనేగా నువ్వు చెప్పేది?"

లాల్ తల పట్టుకున్నాడు, "కోడికూర, భూటాన్ విస్కీ, ఇంకేం కావాలి?"

"నీకు తెలుసు. అదిక్కడ కుదరదు కాబట్టి కోరను."

"షటప్! యూ డర్టీ పార్ట్‌నర్!"

"అయితే ఏం చేయాలో చెప్పు."

"ఆకలి తీర్చుకున్నాక రజని గది గాలించు. ఇన్‌స్పెక్టర్ సోదా చేసినట్టు భూపతి భార్య చెప్పినందువల్ల నేను సరిగా సోదా చేయలేదు. ఇప్పుడు సోదా చేయక తప్పదు. ఎందుకంటే ఇన్‌స్పెక్టర్ సోదా తర్వాత అక్కడ కొత్త ఆధారాలు సృష్టించబడ్డాయి. అందుకు నిదర్శనం ఈ వందరూపాయల నోటు. అర్థమైందా? ఇక వెళ్ళు. నేను చంచలని కలుసుకుంటాను."

జాన్ తలవూపి సాగిపోయాడు. లాల్ కాస్సేపు నిల బడి వెనక్కి తిరిగాడు.

సూర్యారావు పొలం చేరుకునేసరికి లాల్ చెమటతో తడిసిపోయాడు. పొలంలో ట్రాక్టర్ పెట్టి దున్నుతు న్నారు. డ్రైవర్ ఒక్కడే కన్పించాడు.

లాల్ గట్టు వెంబడి చకచక నడుస్తూ పొలాల్లోకి ప్రవేశించాడు. రెండు ఫర్లాంగుల దూరాన పాడుబడ్డ ఇల్లు కన్పిస్తోంది. చుట్టూ కాంపౌండ్ లేదు. మేడమీదికి వెళ్ళడానికి మెట్లు బయటనుంచే వున్నాయి.

డ్రైవర్ లాల్‌ని చూసి నవ్వాడు.

"చంచల వుందా?"

తల వూపాడతను.

"రావుగారెక్కడ వున్నారు?"

"వూరికెళ్ళారు."

లాల్ అడుగులేస్తూ ముందుకి సాగిపోయాడు. మేడ

మీద కిటికీ అతనికి ఎదురుగా వుంది.

చకచక మెట్లెక్కి, మేడమీదికి చేరుకుని మూసివున్న తలుపుమీద చప్పుడు చేశాడు.

తలుపు తెరుచుకుని ఒక వ్యక్తి వచ్చాడు. సన్నగా, పొడుగ్గా, నల్లగా ఉన్నాడు. తెల్లటి దుస్తులు ధరించాడు.

"ఎవరు మీరు, ఎవరు కావాలి...?" చికాగ్గా అడిగాడు.

"మిస్టర్ సంపత్ మీరేనా?"

"అవును."

"మంచిది. నేను డిటెక్టివ్ లాల్ని. హైద్రాబాద్ నుంచి వచ్చాను. లోపల చంచలగారు వున్నారా?"

"ఏం పనిమీద వచ్చారు?"

"లోనికి రావచ్చా?"

"నే నడిగింది ఏ పనిమీద వచ్చారని?"

లాల్ అతన్ని సూటిగా చూశాడు. "చూడండి మిస్టర్, నేను వచ్చింది మమ్మల్ని ప్రశ్నలడగడానికి, జవాబులివ్వడానికి కాదు. మర్యాదగా పక్కకి తొలగండి."

"సంపత్, ఎవరది?" స్త్రీ కంఠం పలికింది లోపలి నుంచి.

"ఎవరో డిటెక్టివ్ట." అన్నాడు సంపత్ అడ్డు తొలగకుండానే.

లాల్ అతన్ని పక్కకి తోసి లోనికి జొరబడ్డాడు.

సంపత్, లాల్ కాలరు పుచ్చుకుని వెనక్కి లాగి, "ఏమిటీ దౌర్జన్యం!" అంటూ అరిచాడు.

లాల్ అతన్ని బలంకొద్దీ మళ్ళీ వెనక్కి తోసి, "మీ

రిద్దరూ ఏం చేస్తున్నారిక్కడ?" అన్నాడు.

టేబిల్ వెనక కూచున్న చంచల, లాల్ దగ్గరకు వచ్చింది. "క్షమించండి" అందామె. "అతనికి ఆవేశం ఎక్కువ. నన్ను బాడీగార్డ్‌లా అంటిపెట్టుకుని వుంటాడు. ఈగ కూడ నామీద వాలనివ్వడు" అని సంపత్ వేపు తిరిగి, "నువ్వెళ్ళు, భోజనం చేసిరా. నే నీయనతో మాట్లాడుతుంటాను" అంది.

సంపత్ బయటి కెళ్ళిపోయాక చంచలని చూసి నవ్వుతూ అన్నాడు లాల్: "వెల్, మీరు కల్పించుకోక పోతే మేం కాస్సేపు రకరకాల విద్యలు ప్రదర్శించుకునే వాళ్ళం. సంపత్‌కి అసలు సింపతీ లేదనుకుంటాను?"

చంచల గాభరాగా చూసింది. ఆమె తెల్లటి చెంపలు ఎర్రబడ్డాయి.

"నెవర్ మైండ్, జరిగింది మర్చిపొండి!" అన్నాడు లాల్ కుర్చీలో కూచొని.

అతని కళ్ళు ఒకసారి గదినంతా పరికించాయి. తలుపుకు కుడివేపు టేబులు, కుర్చీ వున్నాయి. టేబిల్ పైన కొన్ని ఫైళ్ళు, తెల్లకాయితాలు చిందరవందరగా పడివున్నాయి. కొన్ని ఉత్తరాలు కుప్పగా పోసి వున్నాయి. టేబిలు కిందవున్న వేస్ట్ బాస్కెట్ నిండా కాయితపు ఉండలున్నాయి. టేబులుపైన వున్న టైప్‌రైటర్‌లో కొన్ని తెల్లకాయితాలు ఎక్కించి వున్నాయి...

తలుపు కెదురుగా గోడ నానుకుని పుస్తకాల రాక్ వుంది. తలుపుకి ఎడమవేపు కిటికీపక్కన చంచల టేబిలు వుంది. ఆ టేబిలుపైన రెండు ఫైళ్ళు, ఉత్తరాలు, కలాలు వున్నాయి. గదిలో ఎలక్ట్రిక్ దీపాలు లేవు.

"క్షమించండి" అంది చంచల తన స్థానంలో

కూచొని, "మీ రెవరో నాకు తెలియదు."

లాల్ విజిటింగ్ కార్డు ఆమెకి అందించాడు.

"ఓహ్! లాల్!" అర్చిందామె వెంటనే, చదివి "అహఁ! మీరిలా వస్తారని నేననుకోలేదే? మీ పార్ట్‌నర్ ఏడి?."

"హీ ఈజ్ ఈటింగ్" అన్నాడు లాల్.

"ఐయామ్ వెరీ సారీ, మిస్టర్ లాల్" చంచల అన్నది ఆందోళనగా, "సంపత్ మీపట్ల క్రూరంగా ప్రవర్తించాడు."

"మా వృత్తిలో ఇలాటివి మామూలే, నెవర్ మైండ్."

చంచల నిట్టూర్చింది. "పబ్లిషర్‌ని కలుసుకునేందుకు అనేకసార్లు హైదరాబాదు వచ్చానుగానీ మిమ్మల్ని చూడలేదు. మీ ఏజెన్సీ ఎప్పుడూ చాలా బిజీగా వుంటుందని విన్నాను. మిస్టర్ లాల్, మీరిలా రావడం చాలా ఆశ్చర్యంగా వుంది. కేవలం నన్ను చూసేందుకే ఇంత దూరం రాలేదుకదా!"

"ఇక్కడికి వచ్చాక మీ గురించి తెలిసింది__"

"అదెలా?"

"రజని కేసు మీకు తెలుసనుకుంటాను?"

"మీరు ఇన్వెస్టిగేట్ చేస్తున్నారా?" అడిగింది వెంటనే.

"ఏం అలా అడిగారు?"

"ఓహ్, ఏమీలేదు. మిస్టర్ లాల్, మీరు తెలుగు చాలా బాగా మాట్లాడుతున్నారు!"

లాల్ నవ్వి, "మీరు ఇంగ్లీషు బాగా మాట్లాడతారు" అన్నాడు.

"అరె, మీకెలా తెలుసు?"

"మీ మాటల్లో ఇంగ్లీషుపదాలు దొర్లుతున్నాయి."

"యూ ఆర్ మార్వెలెస్!"

"ఆడవాళ్ళంతా ఎడతెరిపి లేకుండా సాంఘిక నవలలు వ్రాస్తోంటే మీరు క్రైం కథలెందుకు వ్రాస్తున్నారు."

నవ్వింది చంచల. "ప్రత్యేకమైన గుర్తింపుకోసం."

"ఎప్పటినుంచి వ్రాస్తున్నారు?"

"డిగ్రీ పూర్తిచేసినప్పటినుంచి,అంటే రెండు సంవత్సరాలనుంచీ."

"చిత్రంగా వుంది," అన్నాడు లాల్. "డిటెక్టివ్ కథలు వ్రాసే అనుభవం యెలా వచ్చింది? మీ వాలకం మాస్తే—"

"చెప్పండి, ఏమిటి?"

"ఉత్తరాలు వ్రాసే అనుభవం కూడా లేనట్టుంది."

ఫకాలున నవ్వేసిందామె, "ఇలా చాలామంది అడుగుతున్నారు. మీరడగడంలో వింతేమీ లేదు,మిస్టర్ లాల్, డిటెక్టివ్ నవలలు వ్రాసే అనుభవం నేను కొమ్మూరి పుస్తకాలు చదివి సంపాదించాను."

"వెల్, మీ అభిమాన రచయితలుగానీ,రచయిత్రులుగానీ యెవరు?"

"కొమ్మూరి, క్రిస్టీ, కౌసల్య."

"మీరు ప్లాట్స్ స్వయంగా తయారు చేస్తారా?"

"ఎందుకలా అడిగారు?"

"మన దేశంలో డిటెక్టివ్ రచయితలు ఇంగ్లీష్ రచయితలను అనుకరిస్తారని అపవాదువుంది—"

"థాంక్ గాడ్! నిజమే కావచ్చునేమోగానీ, నే నెవ

రినీ అనుకరించను—"

"ఆల్ రైట్, మీరిప్పుడేం వ్రాస్తున్నారు?" అంటూ టేబిల్ మీది ఫైలు అందుకోబోయాడు లాల్. చంచల చివాల్న ముందుకు వంగి ఫైలు లాక్కుని, "ఎక్స్‌క్యూజ్ మీ!" అంది. "ఎవరైనా నా కథలు చదవాలను కుంటే—అది ప్రింటింగ్ లోనే."

"మీరు వ్రాస్తున్న కథ పేరేమిటి?"

"సారీ, ఆమెని చంపలేను!"

లాల్ ఆమె కళ్ళలోకి చూస్తూ, "ఎప్పుడు పూర్తవుంది?" అనడిగాడు.

చంచల గబగబ ఇలా చెప్పింది:

"ఇరవైఅయిదు రోజులకో నవల పూర్తిచేస్తాను. ప్లాట్ అల్లడానికి అయిదు రోజులు సరిపోతాయి. రఫ్ స్కెచ్ పదిహేను రోజులు, ఒకరోజు ఫైనల్ చెకింగ్, డ్రాఫ్టింగ్. తర్వాతి మూడురోజులూ టైపింగ్. సంపత్ టైపింగ్ పూర్తిచేసి నాకందిస్తాడు, నేను ఓ.కే. చేస్తాను. వెంటనే డిస్పాచ్. అంతే—ఆ తర్వాత అయిదురోజులు రెస్ట్. ఆ తర్వాత మళ్ళీ రొటీన్ వర్క్."

"అయిడియా లెక్కడనుంచి వస్తాయి?"

చంచల లాల్‌ని సూటిగా చూసింది, "బాత్‌రూం లోంచి వస్తాయి" అంది నవ్వుతూ. "అగథా క్రిస్టీ స్నానం చేస్తున్నప్పుడే ప్లాట్స్ ఆలోచిస్తుందట. నేనూ అంతే."

"థాంక్స్ చంచల, చాలా విషయాలు చెప్పారు. మీరు ఆరితేరిన డిటెక్టివ్ రచయిత్రి కాగలిగారు కానీ మేం ఆరితేరిన డిటెక్టివ్‌లం కాలేకపోయాం."

"కారణం?" అడిగింది చంచల.

"ఈ దేశంలో డిటెక్టివ్‌లని ఆదరించడంలేదు."

"ఓహ్, నాకు తెలుసు. మీ డిటెక్టివ్‌లని కథల్లోనే ఆదరిస్తారు ప్రజలు. కానీ, లాల్, మీ ఏజెన్సీ ఎప్పుడూ బిజీగా వుంటుందే?"

"ఆఫీసు ఖర్చులు భరించలేని సోదర డిటెక్టివ్‌లు చాలామంది వున్నారు, మిస్ చంచల. సరే, అసలు విషయానికి వస్తాను. రచయిత్రిగా మీ లైఫ్ గురించి నాకు చాలా తెలుసుకోవాలని వుందిగానీ, నాకు వ్యవధి లేదు. మీరు ఒకేచోట కూచోని పరిశోధన చేస్తారు. మేం క్షణానికో చోట—"

"ఓహ్, అర్థమైంది. చెప్పండి లాల్. నా సహాయం కావాలా?"

"రజనికి అత్యంత సన్నిహితురాలిగా మీ సహాయం నాకు చాలా అవసరం" అన్నాడు లాల్. "సూటిగా అడుగుతున్నందుకు ఏమీ అనుకోకండి: మీరు డిటెక్టివ్ కథలు వ్రాయడం రజనికి ఎందుకిష్టం లేదు?"

లాల్ ప్రశ్నకి చంచల బిత్తరపోయి చూసింది.

"అలాంటిదేమీ లేదే? నా కథలు ఆమెకి చాలా ఇష్టం."

"బుకాయించి ప్రయోజనం లేదు. నా దగ్గర ఆధార ముంది. మిస్ చంచల, నేనెవరి మీదనయినా ఆరోపణ చేసేముందు ఆధారాలు సిద్ధం చేసుకుంటాను" అన్నాడు లాల్. "మీ డిటెక్టివ్ కథలు రజనికి యిష్టంలేదన్న విషయం నిరూపించమంటారా?"

చంచల చురచుర చూసింది, "అర్థంలేని ఆరోపణకి నిరూపణ అనవసరం!" అర్చిందామె.

"మూడునెలల క్రితం మీరు గుంటూరు నుంచి రజనికి

వుత్తరం వ్రాసారు. ఏం రాశారో జ్ఞాపకం లేకపోతే ఈ ఉత్తరం చదవండి."

లాల్, చంచలకి ఒక వుత్తరం అందించాడు.

చంచల ఎర్రబడ్డ ముఖంతో వుత్తరం గబగబ చదివి; "ఆమె మాయమవడానికీ, ఈ వుత్తరానికీ సంబంధ మేమిటి?" అంది కోపంగా.

"ఏమీ సంబంధం లేకపోతే మీకంత కోప మెందుకు?" నవ్వుతూ అడిగాడు లల్, వుత్తరం తిరిగి తీసుకుని.

"ఆల్ రైట్, మిస్టర్." అంది చంచల తీవ్రంగా చూస్తూ. "ఇదేదో పన్నాగంలా వుంది. నా అభివృద్ధిని సహించని వ్యక్తులు ఏదో పథకం వేశారు, నన్ను పాతాళానికి అణగదొక్కడానికి!"

"తెలుగు డిటెక్టివ్ సాహిత్యానికి బూతు సాహిత్య మని మరో పేరు వుంది. ఇలా దిగజారడానికి రచయితల బాధ్యత చాలావరకు వుంది. నా కథల్లో నేను శృంగార మేమీ జొప్పించడంలేదు. కాబట్టి, నేను డిటెక్టివ్ కథలు వ్రాయడం రజనికి ఇష్టంలేకపోవడానికి శృంగారం కారణంకాదు. నోట్ చేసుకోండి."

లాల్ తలవూపాడు.

"ఇక నా ఎనిమిదవ నవల 'ఈ రాత్రి తెల్లారదు!' గురించి మీకు చెప్పాలి. ఆ కథలో హింసకి హద్దులేదు. అందులోని పాత్రలన్నీ పాశవిక ప్రవృత్తిగలవే. విచ్చల విడి హత్యలు, రక్తపాతం, దౌర్జన్యం వీటన్నిటితో ఆ నవల చదవడానికి భయం పుట్టించేలా తయారైంది. అఫ్ కోర్స్, మీరూ చదవలేరు. ఒళ్ళు జలదరించే సంఘ టనలు, నరాలు పిప్పిచేసే సస్పెన్స్ మీరు భరించలేరు.

ఆ నవల ఇప్పుడు సినిమాగా తీస్తున్నారు. ఇంతకీ సంగ తేమిటంటే ఆ నవల చదివాక రజని మెంటల్ షాక్ కి గురయింది..."

చంచల చెప్పడం ఆపేసి అదోలా చూసింది లాల్ ని.

"అప్పటినుంచీ నా కథలంటే ఆమెకి ఎలర్జీ పుట్టింది. క్రైంకథలు మానుకోమని పదేపదే చెప్పసాగింది. సాంఘిక కథలు వ్రాయమని వెంటపడింది. వీల్లేదన్నాను. వాగ్వివాదాలు జరిగాయి. ప్రేమకథలు వ్రాయడం నాకు చేతగాదు. క్రైంకథలు మానుకోలేను. ఐ లవ్ డిటెక్టివ్ స్టోరీస్. రజని నాతో మాట్లాడడం మానేసింది. మూడు నెలల నుంచి మా మధ్య మంచి సంబంధాలు లేవు. ఎలాగైనా నాచేత క్రైం కథలు వ్రాయడం మాన్పిస్తానని పందెం కట్టింది. అదెవరి తరమూ కాదు."

"మిమ్మల్ని బెదిరించేదా?"

"ఎందుకు? అలాటిదేమీ లేదు!"

"ఒక స్థలంలో పోలీసులు సోదాచేసి వెళ్ళిపోయాక అక్కడ ఆధారాలు సృష్టించబడడానికి కారణమేమిటి? చెప్పగలరా?"

చంచల ఓరచూపులు చూసింది. "రజని గదిలో ఇంకా ఏం దొరికాయి?"

"వందరూపాయల నోటు—ఇన్ స్పెక్టర్ సోదాచేసి నప్పుడు లేదు" అన్నాడు లాల్.

చంచల ఛటుక్కున అంది. "మైగాడ్! వూహించ లేరా?!"

"అందుకే మిమ్మల్ని అడిగాను."

"రజని అదృశ్యమయాక తిరిగి ఇంటికి వచ్చింది!"

"ఎప్పుడు?"

"ఇన్‌స్పెక్టర్ సోదా చేశాక! మిస్టర్ లాల్, ఆ గదిని యింకా జాగ్రత్తగా గాలించండి, కొత్త ఆధారాలు దొరుకుతాయి. రజని ఏదో ఆపదలో వుంది. పోలీసుల సహాయం కోరే వ్యవధి ఆమెకు లేదు. ఎవరికీ చెప్పకుండా తనకి క్షేమంగా వుండే చోటుకి వెళ్ళిపోయింది. అపాయం తొలగే సూచన లేదు. అయినా అవకాశం చూసుకుని ఇంటికి వచ్చివుంటుంది!"

"వెల్, ఇంటికి వచ్చి ఏం చేసింది?"

"తన ఆచూకీ తెలిపే ఆధారాలు సృష్టించి వెళ్ళిపోయింది. అంతే, ఇంతకంటే మంచి ఎక్స్‌ప్లనేషన్ ఇవ్వలేను. ఈ నోటుకి అదే అర్థం. జాగ్రత్తగా గాలించండి, ఆధారాలు దొరుకుతాయి. ఆధారాలు దొరికాయంటే రజని దొరికిందన్న మాటే!"

"థాంక్స్" అన్నాడు లాల్ ఆరితేరిన క్రైం రచయిత్రిని చూసి, "నా పార్ట్‌నర్ ఈ పాటికి గాలిస్తూనే వుంటాడు. వెల్, చంచల—మాయమైన రోజున రజని మిమ్మల్ని కలుసుకుందా?—"

"ఈ జంటిల్‌మన్ ఇంకా వెళ్ళలేదా?"

వినిపించాయి మాటలు తలుపు వేపునుంచి. లాల్ వెనక్కి తిరిగి చూశాడు.

గుమ్మంలో సంపత్ నిలబడివున్నాడు. అతని ముఖంలో కోపం ఉట్టిపడుతోంది.

"చంచలా! ఏమిటిది! శివరంజని గురించి మర్చిపోయావా" అతని అరుపులకి గది ప్రతిధ్వనించింది...

5

"స...మ్‌మ్...పత్!" అర్చిందామె హిస్టరికల్‌గా!

"ఏమిటి చంచలా?"

"వెళ్ళిపో, నువ్వెళ్ళిపో ఇక్కడ నుంచి!" అరుస్తోంది చంచల ఆందోళనగా,

"ఓహ్, సంపత్! నువ్వు స్టుపిడ్‌వి! ఈడియట్‌వి. బాస్టు—"

"షటప్ చంచల!" ఆమె చంప వాయించి అర్చాడు సంపత్.

"నోర్మూసుకో, నీకేమయిందనీ ఇలా అరుస్తున్నావ్? ఛ! నీలాంటి రైటర్ దగ్గర పనిచేయడం నాకు సిగ్గుచేటు!"

చంచల కోపాన్ని హద్దులో పెట్టుకుని లాల్‌ని చూసింది, "మిస్టర్ లాల్, యింకా చూస్తారేమిటి! ఇతరుల తగవు తమాషాగా తిలకించడం తప్పని మీకు తెలీదూ? వెళ్ళండి, తక్షణం వెళ్ళిపోండి!"

"శివరంజని అంటే మీకు భయమా?" లాల్ అడిగాడు.

"నో! ఓహ్—సంపత్!"

"ఆమె ఎవరు?"

"ఎందుకు! నా ఫ్రెండ్!"

"అయితే భయం ఎందుకు?"

"చూడండి లాల్, నేనెవరికీ భయపడను. ఆమె టి.పి. గూడెం నుంచి ఇవాళ వస్తోంది. ఆమె...ఆమె నాకు—ఓహ్ లాల్! ఎలా చెప్పాలి మీకు!"

"ఏమిటి?"

"నన్నర్థం చేసుకోమనీ!"

లాల్ లేచాడు, "వెల్, అర్థం చేసుకున్నాను" అన్నాడతను. "మిమ్మల్నే కాదు, పూర్తి కేసునీ! గుడ్ బై ఫ్రెండ్స్, వస్తాను."

లాల్ చకచక బయటికి నడిచి భూపతిరావు ఇంటికి చేరుకున్నాడు.

భూపతిరావు, అతని భార్య వరండాలో కూచొని మాట్లాడుకుంటున్నారు. లాల్‌ని చూసి లేచి నిలబడి, ఆసక్తికరంగా చూశారు.

"రావుగారూ, ఇప్పుడు నన్నేం అడక్కండి" లాల్ అన్నాడు వారిని జాలిగా చూస్తూ, "మీ కూతురి జాడ చాలా త్వరగా తెలుస్తుంది. రజని మీ నుంచి చాలా దాచింది. అదే ఆమెకు ప్రాణాలు మీదికి తెచ్చింది—"

"ప్రాణాలమీదికి!?"

"క్షమించండి, క్షమించండి, నన్నేమీ అడక్కండి. జాన్ ఎక్కడ?"

"నిద్రపోతున్నాడు."

లాల్, జాన్ గదిలోకెళ్ళి చూశాడు. అతను నిద్ర పోతున్నాడు. పైన సీలింగ్ ఫాన్ తిరుగుతోంది. తలగడ పక్కన టేప్ రికార్డర్ నుంచి తక్కువస్థాయిలో ఏదో పాట వస్తోంది. లాల్ ట్యూను పెంచాడు.

"ఎరక్కపోయి వచ్చాను, ఇరుక్కుపోయాను' అంటోంది అందులోని గొంతుక.

జాన్ చటుక్కున లేచి కూచున్నాడు, రికార్డర్ ఆఫ్ చేసి, "న్యూసెన్స్!" అంటూ గొణిగాడు.

"జాన్ ఇది పడుకునే సమయం కాదు" స్టూలుపైన కూచొని లాల్ అన్నాడు "ఏం కనుక్కున్నావు?"

జాన్ నిద్రమత్తు వదిలింది.

తాను కనుక్కున్న వివరాలు వెల్లడించాడు:

రజని గదిలో మంచంమీది పరుపుకింద ఒక నలిగి పోయిన కాయితం ముక్కవుంది. అందులో అక్షరాలను

బట్టి అది స్త్రీ దస్తూరీ అని తెలుసుకోవచ్చు.

ఆ కాయితంలోని సారాంశం యిది:—

"నాన్నా,

నేను క్షేమంగా వున్నాను. గాభరాపడకండి, అమ్మకు ధైర్యం చెప్పండి. నిన్న మధ్యాహ్నం నా ఫ్రెండ్ శ్రీవిద్య చాగల్లు నుంచి వస్తోందని స్టేషన్‌కి బయలుదేరాను. కానీ దార్లో ఎవడో ఆగంతకుడు అకాట యించి చెట్లచాటునవున్న కార్లో ఎక్కించుకుని రాజ మండ్రీ తీసుకెళ్ళాడు. అతని దగ్గర పిస్తోలువుంది. నాకేమీ సంభవించదని హామీయిచ్చాడు. గోదావరి బ్రిడ్జి దాట గానే మరో ముగ్గురు కారెక్కారు. అంతా కలిసి నన్ను ఆల్ కాట్స్ గార్డెన్‌లో ఒక ఇంట్లో బంధించారు.

ఈ రోజు మధ్యాహ్నం వాళ్లు నా దగ్గిరికి వచ్చి ఈ వుత్తరం వ్రాయమన్నారు. అందుకే వ్రాస్తున్నాను. ఈ వుత్తరంతో బాటు ఒక వందరూపాయల నోటు కూడా గదిలో వుంటుంది. అది మేజా సొరుగులో వుంటుంది. రేపుదయం ఒక వ్యక్తి వచ్చి ఆ వందరూపాయలనోటు మీద నెంబరు చెప్తాడు. మీరు ఆ నెంబర్ సరిచూసుకుని ముప్ఫైవేలు ఇవ్వాలి. అంతే, ఆ తర్వాత నేను విడుదలయి పోతాను. నాన్నా, ఇది నమ్మండి!

నేను క్షేమంగా మీకు దక్కాలంటే, పోలీసులకి తెలియజేయకండి.

ఇట్లు,

—రజని"

ఈ వుత్తరం చదివితే అసంఖ్యాకమైన అనుమానాలు రాక తప్పవు! తానెలా అపహరించబడిందీ రజని వ్రాసేం దుకు ఆగంతకులు ఎలా అంగీకరించారు? తానెక్కడ

వుందో తెలియజేసే ఆచూకీ రజని తెలిపేందుకు ఎలా సమ్మతించారు? అది వాళ్ళకు ప్రమాదకరం కాదా? ఈ వుత్తరం గదిలో ఎవరు పెట్టారు? ఆగంతకులా, రజనియా? అయితే డబ్బుకోసం కిడ్నాపర్ ఇన్ని రోజులు గడిచినా ఎందుకు రాలేదు? రజనికి ఏదేనా సంభవించిందా?

అయిదురోజులు గడిచినా కిడ్నాపర్ డబ్బుకోసం రాలేదంటే రెండు కారణాలున్నాయి. ఒకటి: రజని తప్పించుకోడం. రెండు: ఆమె మరణించడం.

రజని తప్పించుకుని వుంటే ఈ పాటికి ఇల్లు చేరాలి. కానీ అలా జరగలేదు. కాబట్టి మరణించిందా?

జాన్ కథనం అంతా విన్నాక నవ్వాడు లాల్, "ఈ ఉత్తరం చదివాక నీకు సుఖంగా నిద్ర ఎలా పట్టిందో అర్థం కావడంలేదు. జాన్."

"ఈ ఉత్తరానికీ, రజని మాయమవడానికీ అసలు సంబంధమే లేదు" అన్నాడు జాన్, "ఇంత నిర్భయంగా ఏ కిడ్నాపరూ వుత్తరం వ్రాయించడు! రజని యెక్కడ బంధింపబడి వుందో వుత్తరంలో వ్రాసివుంది. కానీ అది నిజమని గ్యారంటీ యేమిటి? అయిదురోజులు గడిచినా కిడ్నాపర్ డబ్బుకోసం రాలేదు, కాబట్టి యిది ఫేక్ కిడ్నాపింగ్ ప్లాట్. దీని వెనుక రహస్యం వుంది. ఇదంతా రజని ఏ వుద్దేశ్యంతోనో బుద్ధిపూర్వకంగా చేస్తుండాలి, లేదా ఎవరో ఆమెని..."

"నువ్వేమీ చెప్పనవసరంలేదు జాన్" లాల్ అడ్డు తగిలాడు. "ఇది క్లిష్టమైన కేసు అనుకున్నాం. కానీ, ఇప్పుడు చాలా సులభంగా తేలిపోతోంది."

"ఎలా?"

"ఇంచల డిటెక్టివ్ కథలు వ్రాయడం రజనికి అసలు

ఇష్టంలేదు. దానికి చంచల ఒక కారణం చెప్పింది. అది సరైనది కాదు. చంచల సంగనాచిలా ప్రవర్తిస్తోంది. ఆ అమ్మాయిదగ్గర తెలివితేటలు వున్నాయి. కథలు వ్రాయడానికి తెలివితేటలు వుంటే సరిపోదు. గొప్పగొప్ప సైంటిస్టులదగ్గర అమోఘమైన తెలివితేటలుంటాయి. కానీ కథలు వ్రాయగలరా? అసంభవం. కథలు వ్రాసేందుకు తెలివితోపాటు చక్కని కల్పనాశక్తి కావాలి. భావాల్ని వెల్లడించగల్గాలి. ఏమంటావు?''

'దటీజ్ రైట్''

''వెల్, చంచలకి కల్పనాశక్తీ, వూహాపటిమా లేవనుకుందాం. అప్పుడామె ఏంచేస్తుంది కథలు వ్రాసేందుకు?''

''ఏం చేస్తుంది?''

''కాపీ చేయడానికి సిద్ధపడుతుంది. అంటే కాపీరైటుని ఆమె కాపీచేసే హక్కుగా అపార్థంజేసుకుంటుంది.''

''అర్థంగావడంలేదు లాల్.''

''ఒక్క ముక్కలో తేల్చాలంటే చంచలకి కథలు వ్రాయడం రాదు!'' అన్నాడు లాల్. ''ఆమె ఇతర కథల్ని కాపీ చేస్తోంది. అందుకు ఇంగ్లీషు నవలలు బాగా పనికి వస్తాయి. పేరున్న రచయితలు కథలు కాపీ చేయరు, ఇట్టే పట్టుబడిపోతుంది. కాబట్టి ఎవరో అనామకుల కథల్ని ఎన్నుకుంటుంది. కొందరు రచయితలుంటారు. వాళ్ళు ఒకటి రెండు నవలలు వ్రాసి అంతర్థానమవుతుంటారు. వాళ్ళ నవలలు ఆమెకి బాగా ఉపయోగపడుతాయి. పట్టుబడే అవకాశాలు వుండవు...''

''చంచల కథలు కాపీ చేయడానికీ రజని మాయమవడానికీ సంబంధమేమిటి?''

"చంచల గుట్టు రజనికి తెలిసిపోయి బ్లాక్ మెయిలు చేస్తుండాలి. తన గుట్టురట్టయితే శిక్ష తప్పదని చంచలకి తెలుసు. అందుకని రజనిని..."

"ఏం చేసింది?"

"చంపేసింది." లాల్ అన్నాడు. "చంచల, పూర్ గర్ల్! 'శివరంజని' అంటే యేమిటో నాకు తెలియదనుకుంది. జాన్, చంచల, సంపత్ ఒక కోడ్ ఉపయోగిస్తున్నారు. 'శివరంజని' అని. దానివే 'శవరంజని', అనుకుంటే 'రజని శవం' అవుతుంది!!"

"ఎలా?"

" 'శ_వ_ర_ం_జ_ని' లోని అక్షరాల్ని తారుమారు చేస్తే రజని శవం అవుతుంది___అవునా?"

జాన్ నోట మాట రాలేదు. లాల్ నవ్వాడు.

"లాల్! ఏమిటిది?"

"కోడ్‌ని డీకోడ్ చేశాను. ఇక డిటెక్షన్ చేయాలి' అన్నాడు లాల్.

"చంచల తన గుట్టురట్టయితే చట్టరీత్యా శిక్ష తప్పదన్న భయంతో శిఖరాలందుకున్న పేరుప్రతిష్ఠలు మట్టిపాలవుతాయన్న ఆదుర్దాతో, తనని బ్లాక్ మెయిలు చేస్తూ ప్రమాదకరమైన వ్యక్తిగా తయారైన స్నేహితురాలు రజనిని అంతం చేసింది. ఆమె శవాన్ని ఎక్కడో ఖననం చేశారు. ఈ దారుణ సంఘటనగురించి ఎవరికీ తెలియదు. అందరూ రజని యెక్కడికో అదృశ్యమైందనుకుంటున్నారు. ఆమాకీ ఎవరికీ తెలియదు.

"అయినా చంచలకి ఎప్పటికీ ప్రమాదకరమే. హత్య బయటబడితే ఉరికంబం ఆహ్వానించక వూరుకోదు. అందుకే కేసు పెడదోవ పట్టించాలనుకుంది. ఈ వుత్తరం

ఆమె సృష్టించిందే. కిడ్నాపరు రాడు, రజనీ రాదు కాబట్టి ఆగంతకులతోనే ఆమెకి ఏదైనా సంభవించి వుంటుందని అనుకుంటారందరూ. హత్య బయటపడితే, అది కిడ్నాపింగ్ పర్యవసానం అని వూహించడం సులభం.''

జాన్ మెరుస్తున్న కళ్ళతో లాల్‌ని చూశాడు.

''కానీ, లాల్, ఆమెకి కథలు వ్రాయడం రాదని ఎలా వూహించావు?''

''ఆమె ప్రవర్తన ఆధారం'' అన్నాడు లాల్. ''నా వూహ నిజం కావాలంటే ఆమె స్థావరంలో సోదా జరపాలి.''

''ఇన్‌స్పెక్టర్ సహాయంతో'' అన్నాడు జాన్.

''ఎందుకు?''

''ప్రభుత్వాధికారి సాక్షిగా వుంటే కేసు బలంగా వుంటుంది'' జాన్ అన్నాడు. ''లాల్, మరి రజని ఇన్‌స్పెక్టర్‌కి వ్రాయదల్చుకున్న ఉత్తరం గురించి ఏం చెబుతావు?''

ఒక్క క్షణం ఆలోచించి లాల్ అన్నాడు. ''చంచల కథలు కాపీ చేస్తున్నట్లు రజనికి తెలిసి ఆమెని మందలించింది. చంచల వూరుకోలేదు. వ్రాస్తూనే వుంది. రజని మందలిస్తూనే వుంది. చివరికి ఇక లాభం లేదనుకుని రజని పోలీసులకి చంచల గురించి ఉత్తరం వ్రాయాలనుకుంది. కానీ, వుత్తరం మధ్యలో ఆపేసింది. ఎందుకు? చంచలకి ఫైనల్ వార్నింగ్ యిచ్చి చూద్దామని. కాపీ చేయడం మానుకోకపోతే పోలీసు రిపోర్టు యిస్తానని బెదిరించింది__''

''వెల్, ఆ తర్వాత?''

''పరిస్థితి సీరియస్‌గా తయారైందని చంచల వూహిం

చింది" లాల్ చెప్పుకుపోతున్నాడు. "రజని నోరు నొక్కకపోతే అపాయం తప్పదు. రజని ప్రాణాలతో వుండకపోతేనే తనకి క్షేమమని చంచల భావించింది. అంతే! సంపత్ రంగంలోకిదిగి రజని ప్రాణాల్ని గాలిలో కలిపాడు__ఆ తర్వాత శవాన్ని మట్టిలో కలిపాడు. దట్సాల్!"

"ఓహ్, లాల్!"

"మనం ఆమె స్థావరాన్ని సోదా చేయాలి. ఆమె కథలు కాపీ చేస్తోందని ఋజువయితే హంతకురాలిగా నిరూపించడం చాలా సులభం. 'శివరంజని!' బహుశ తాడేపల్లి గూడెంలో ఆమెకి 'శివరంజని' పేరు గల ఫ్రెండ్ వుండదు! కమాన్! జాన్! పోలీసుస్టేషన్కు వెళ్దాం!" అంటూ లేచాడు లాల్.

6

రాత్రి ఎనిమిదిగంటల వేళ...

ఇన్స్పెక్టర్ పోతరాజుతో కలిసి లాల్, జాన్లు చంచల స్థావరానికి బయలుదేరారు. లాల్ కథనం పోతరాజు ససేమిరా ఒప్పుకోలేదు. చంచల చాకులాటి అమ్మాయి అనీ, అర్థంలేని ఆరోపణలు చేస్తే ఆమె లక్ష రూపాయలకి పరువునష్టందావా వేసినా ఆశ్చర్యం లేదని అన్నాడతను.

ఆకాశంలో చంద్రుడు లేడు. కటిక చీకట్లో ఒకరి ముఖాలొకరికి కన్పించడంలేదు. నిశ్శబ్దంగా నడుస్తున్నారు ముగ్గురూ. వూరు దాటి సూర్యారావు పొలాలు చేరుకునేసరికి పావుగంట గడిచింది. చంచల చీకట్లో కరెంటులేని ఆ పాడుబడ్డ ఇంట్లో వుండడం అసంభవం.

చీకట్లో ఇంటిగోడలు తెల్లగా, స్పష్టంగా కన్పిస్తు

న్నాయి. లాల్ కి తెలుసు. చంచల తనని పట్టిచ్చే ఆధారాల్ని ఎప్పుడో నాశనం చేసి వుంటుందని. కాని ఆధారాలు నాశనం చేయడంలో నేరస్తులు ఎక్కడో పొరపాటు చేస్తారని అతనికి తెలుసు.

మెట్లద్వారా పైకి చేరుకున్నాడు. జాన్ 'స్కెలెటన్ కీ'తో తాళం తెరిచాడు. ముగ్గురూ లోనికి వెళ్ళారు. ఇన్స్పెక్టర్ టార్చ్ వెలిగించాడు. వేసవికాలం కాబట్టి లోన వుక్కగావుంది.

జాన్ గది వెనక వేపు కిటికీ తెరిచాడు. బయటి చీకట్లోంచి చల్లనిగాలి రివ్వుమని దూసుకువచ్చి గిలిగింతలు పెట్టింది. ఆ గాలిలో జాన్ కిరసనాయిలు వాసన పసిగట్టాడు. ముక్కుపుటా లెగరేస్తూ లాల్ ని రమ్మన్నట్లు సైగ చేశాడు.

"ఏమిటి, పార్ట్నర్?" లాల్ అడిగాడు.

"వాసన__"

"అవును, అది నీ చెమట వాసన."

"గాలి గట్టిగా పీల్చు బ్రదర్."

లాల్ గుండెలనిండా గాలిపీల్చి కళ్ళు తేలేసి, స్థాణువైపోయాడు.

"ఏదో వింత వాసన!" వూపిరి వదులుతూ అన్నాడతను.

"కిరోసిన్ వాసన!" జాన్ చెప్పాడు. "ఎక్కడ నుంచి వస్తోంది?"

"గదిలో కిరసనాయిలు వొలికిందా?" ఇన్స్పెక్టర్ వెనక నుండి అడిగాడు.

"ఓహ్! అటు చూడు, లాల్!" జాన్ గొణిగాడు, "ఏదో కాలుతోంది! ఎవరితో ఆకారం అక్కడ కూచోనుంది!"

''ఇన్‌స్పెక్టర్, టార్చి ఆఫ్ చెయ్యండి'' లాల్ అన్నాడు. ''మీరిద్దరూ ఇక్కడే వుండండి. నేను బయటికి వెళ్ళి చూసివస్తాను.''

చకచక మెట్లుదిగి కిందికి వచ్చాడు లాల్. ఇంటి వెనక వేపు ఇరవై గజాల దూరాన చిన్న మంట మండుతోంది. లాల్ వేగంగా వురుకుతూ మధ్యలో హఠాత్తుగా ఆగిపోయాడు. మంటదగ్గర కూచున్న ఆకారం లేచి లాల్ వేపుకు పరిగెత్తుకుని వస్తోంది. ఆ ఆకారం లాల్‌కి చేరువ కాగానే, ''చంచలా?'' అన్నాడతను.

'కవ్వుమని' అర్చిందా స్త్రీ ఆకారం.

''మంట నార్పుదాం, రండి!'' ఆమె చెయ్యి పట్టుకుని లాక్కెళుతూ లాల్ అన్నాడు. చంచల గింజుకుంటూ అరుస్తోంది. వెనుక నుంచి మరో రెండు ఆకారాలు పరిగెత్తుకు వచ్చాయి.

''జాన్, ఆ మంటనార్పేయి!'' లాల్ అర్చాడు. జాన్ వురికాడు. ఇన్‌స్పెక్టర్ చంచల చేతులు పట్టుకున్నాడు.

జాన్ మంటనార్పి లాల్‌ని పిల్చాడు. టార్చి వెలుగులో సగం కాలిన పది ఇంగ్లీషు, హిందీ నవలలు; రెండు వ్రాత ప్రతులు ఒక డెమ్మీసైజు డైరీ కన్పించాయి.

7

తన లాయర్‌ని సంప్రదించేవరకు ఎలాంటి ప్రశ్నలకీ జవాబులివ్వనని భీష్మించుకుని కూర్చుంది చంచల.

''చంచల, మీ లాయర్ నిన్ను ఏమీ చేయలేడు'' లాల్ అన్నాడు.

''హత్యకు సంబంధించిన ఆధారాల్ని నాశనం చేస్తుండగా మిమ్మల్ని రెడ్ హాండెడ్‌గా పట్టుకున్నాం. డైరీలో

మీరు వ్రాసుకున్న విషయాలు మిమ్మల్ని రక్షించడానికి పనికిరావు. డైరీలో చివరి పేజీలో మీరు వ్రాసుకున్న స్నేహితుల చిరునామాల్లో 'శివరంజని' అడ్రసువుంది. ఆ అడ్రసుకి మేం వెళితే శివరంజని లేదు, రజని శవం దొరికింది.

"మీరు కథలు కాపీ చేస్తున్నారనడానికి నిదర్శనాలు ఈ వ్రాతప్రతులు, పుస్తకాలు: 'కిల్ ఆర్ గెట్ కిల్డ్'ని 'సారీ, ఆమెని చంపలేను'గానూ 'ఏక్ ఖూనీ రాత్'ని 'రక్తం చిందిన రాత్రి'గానూ మీరు కాపీ చేస్తున్నారు.

"కాపీ చేయడమంటే మూలకథను కాపీ చేయడం కాదు. ప్రతి వాక్యాన్నీ తెలుగులోకి తెలివిగా అనువదిస్తున్నారు. అందుకు నిదర్శనం, ఈ ఇంగ్లీషు నవలలో అక్కడక్కడ మీకర్థంకాని పదాలకి వ్రాసుకున్న తెలుగులో సమానమైన పదాలు.

"క్రైం రచయిత్రిగా కాపీరైట్ చట్టాన్ని ఉల్లంఘించడం నేరమని మీకు తెలుసు. కీర్తికోసం మనుషులు ఎలాటి నేరమైనా చేస్తారు. మీరూ అంతే. మీరు చేస్తున్నతప్పుని సరిదిద్దాలనుకున్న రజనిని అడ్డు తొలగించారు. చిన్న నేరాన్ని కప్పిపుచ్చేందుకు ఘోరమైన నేరం చేశారు.

"చంచల, ఇన్ని నవలలు అనువదించిన మీరు స్వయంగా ఒక్క నవల వ్రాయలేరా! ఆల్ రైట్, హత్య మీరు చేసివుండరని నా నమ్మకం. కానీ చేయించారని నా అభిప్రాయం. మీకు న్యూసెన్సుగా తయారైన రజనిని చంపి మరో నాటకమాడారు, ఫేక్ కిడ్నాప్ సృష్టించి, తన తండ్రికి రజని వ్రాసిన వుత్తరాన్ని మీరు మీ స్వహస్తాలతో ఆమె దస్తూరీని ఫోర్జరీ చేసి సృష్టించారు. కానీ విఫలమయ్యారు. ఐ పిటీ యూ!"

చంచల ముఖం అవమానంతో కందిపోయింది.

ఇన్‌స్పెక్టర్ పోతరాజు జాలిగా ఆమెని చూసి, "ఈ వూరికి చెడ్డపేరు తెచ్చావు! రచయిత్రిగా నువ్వు వెలిగిపోతున్నప్పుడు ప్రతివారూ ఈ వూరు గురించి చెప్పుకుని పొగిడేవారు. షేమ్ చంచల షేమ్!"

"ఓ.కే. ఫ్రెండ్స్" చివరికి నోరు విప్పింది చంచల. ఆమె ముఖంలో పశ్చాత్తాపం గోచరిస్తోంది. "ఈ పరిస్థితిలో ఏ లాయరూ నన్ను రక్షించడని అర్థంచేసుకున్నాను. ఇప్పుడు నేను నేరం ఒప్పుకోడానికి సిద్ధంగావున్నాను. ఎందుకంటే ఈ నేరాల్ని కప్పిపుచ్చుకునే మార్గాలు లేవు కాబట్టి. లాల్, సంపత్ 'శివరంజని ప్రస్తావన తీసుకురాక పోతే 'రజనిశవం' క్షేమంగా వుండేది. ఆ స్టుపిడ్‌కి మెదడులేదు" అంటూ బాధగా తల వాల్చేసింది చంచల.

—: ఐపోయింది :—